ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల
జిల్లా వార్తలు

శనివారం 24 ఫిబ్రవరి 2024



మందమర్రిలో అమ్మవార్ల దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

పులకించిన జనం

- సమ్మక్క సారలమ్మకు భక్తుల మొక్కులు
- జనసంద్రంగా మారిన జాతర పరిసరాలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు
- దర్శించుకున్న నాయకులు
- సేవలు అందిస్తున్న విద్యార్థులు, వలంటీర్లు

ఏసీసీ, ఫిబ్రవరి 23: జిల్లాలో సమ్మక్క సారలమ్మకు మొక్కులు చెల్లించి భక్తులు పులకించిపోయారు. మంచిర్యాల గోదావరి తీరంలో నిర్వహిస్తున్న సమ్మక్క సారలమ్మ జాతరకు మూడో రోజు శుక్రవారం భక్తులు పోటెత్తారు. అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి అమ్మవార్లను దర్శించుకున్నారు. శివసత్తులు పూనకాలతో నృత్యాలు చేశారు. నిలువెత్తు బెల్లంతో తులాబారం చేయించుకుని అమ్మవార్లకు సమర్పించారు. సాయంత్రం కొంత మంది భక్తులు ఇళ్లకు తిరుగు ప్రయాణం కావడంతో వచ్చేవారు పోయే వారితో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. ట్రాఫిక్‌ను అదుపు చేయలేక పోలీసులు సతమతమయ్యారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తరుపున మహిల కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గజ్జల హేమలత ఆధ్వర్యంలో సమ్మక్క సారలమ్మలకు బెల్లాన్ని సమర్పించి మొక్కులు చెల్లించారు.

మందమర్రి టౌన్/ రామకృష్ణాపూర్: పట్టణంలోని పాలవాగు ఒడ్డున శుక్రవా రం సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకు న్నారు. ఉదయం నుంచే సమ్మక్క సారలమ్మలు గద్దెలపై ఉండడంతో అమ్మ వార్ల దర్శనం కోసం కుటుంబాలతో తరలి వచ్చారు. దర్శనం అనంతరం కానుకలు, నగదుతో పాటు వెండి, బంగారు ఆభరణాలు కానుకలుగా సమర్పించుకున్నారు. పోలీసులు, సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు భక్తులకు సేవలందించారు. ఎస్వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సమ్మక్క సారలమ్మను దర్శించుకున్నారు. మందమర్రి ఏఐటీయూసీ బ్రాంచి నాయకులు దాగం మల్లేష్, సలేంద్ర సత్యనారాయణ, గాండ్ల సంపత్, మేకల సంతు తదితరులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆర్య వైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు రావికంటి వెంకటేషం కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. కాగా వన దేవతల జాతరకు మంద మర్రి ఎస్అండ్ పీసీ సిబ్బంది మెరుగైన సేవలందిస్తున్నారు. శనివారం సమ్మక్క సారలమ్మ వనప్రవేశం చేయనున్నారు. సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తులకు సింగరేణి మహిళ జూనియర్ డిగ్రీ పీజీ కళాశాల విద్యార్థులతో పాటు లయన్స్‌క్లబ్ సభ్యులు సేవలందించారు. లయన్స్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడు చంద్ర మోహన్ గౌడ్ అల్పాహారం అందజేశారు.



సింగరేణి అధికారుల వైఫల్యం..

ఆర్కే 1ఏ పాలవాగు వద్ద సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్ల విషయంలో సింగరేణి అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారు. భక్తుల దర్శనం కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్ల వద్ద పలువురు ఎస్అండ్ పీసీ సిబ్బంది భక్తులపై దురుసుగా వ్యవహరించడంతో ఎస్అండ్‌పీసీ సిబ్బందికి, భక్తులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. శుక్ర వారం రోజు దర్శనం కోసం వచ్చిన భక్తులకు, ఎస్ అండ్‌పీసీ సిబ్బందికి మధ్య తోపులాట జరిగింది. సింగరేణి అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో పట్టణ ఎస్సై రాజశేఖర్ కలుగజేసుకొని భక్తులకు నచ్చచెప్పి దర్శనం ఏర్పాట్లను చేపట్టడంతో వివాదం సద్దుమనిగింది.

శ్రీరాంపూర్: సీసీసీలోని ముక్కిడి పోచవ్వ ఆలయం వద్ద ప్రతిష్ఠించిన సమ్మక్క, సారలమ్మలను సీసీసీ సమీప ప్రాంతాలు, గ్రామాలకు చెందిన భక్తులు దర్శించుకున్నారు. తమ, తమ మెక్కలు చెల్లించుకున్నారు. సింగరేణి అధికారులు ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. అన్ని ఏర్పాట్లు చేసినందుకు వివిధ విభాగాల సిబ్బందిని డీసీఎం(పర్సనల్) అరవిందరావు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ యూనియన్ నాయకులు, సింగరేణి సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రి రూరల్: మండలంలోని ఆర్కే1ఏ అటవీ ప్రాంతంలో జరుగుతున్న సమ్మక్క సారలమ్మ జాతరకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వెళారు. వన దేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ నాయకులు ఒడ్నాల కొమురయ్య, గందె రాంచందర్‌లు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కోటపల్లి: మండలంలోని రాపన్‌పల్లి, నక్కలపల్లి మల్లంపేట గ్రామాల్లో కొనసాగుతున్న సమ్మక్క సారలమ్మ జాతరలో వన దేవతలకు భక్తులు ఘనంగా మొక్కులు చెల్లించారు. మహిళలు బోనాలు సమర్పించారు.







శ్రీరాంపూర్‌లో అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు, మంచిర్యాలలో సమ్మక్క సారలమ్మ జాతరకు తరలివచ్చిన భక్తులు, కోటపల్లిలో జాతరకు తరలివచ్చిన భక్తులు

పెండింగ్ బిల్లును క్లియర్ చేయాలి

- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 23: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు డీఏ మం జూరు చేయడంతో పాటు పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ధరల వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉద్యోగులకు రావాల్సిన నాలుగు డీఏలను విడుదల చేయాలన్నారు. సరెండర్ లీవులు, పీఆర్సీ బకాయిలు, సీపీఎస్ బకాయిలు, మెడికల్ బిల్లులు లాంటి ఆర్థిక పరమైన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్ర మంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బీసగౌని శంకర్‌గౌడ్, కరుణాకర్, సత్తయ్య, పద్మ, మహాలక్ష్మి, ప్రభావిత, మల్లేష్, కోటేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, రజిత, మన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ నాయకురాలు మృతి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 23: మలిదశ తెలంగాణ రాష్ట్ర సాదన ఉద్యమనాయకురాలు చల్లగుళ్ల విజయశ్రీ (54) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. మంచిర్యాలకు చెందిన విజయశ్రీ వ్యాపా రవేత్తగా సుపరిచితురాలు కాగా రాజకీయ ప్రవేశంలో భాగంగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆపై తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ఊపందుకోవడంతో జేఏసీ మహిళా విభాగం కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఉద్యమ పార్టీ బీఆర్ఎస్‌లో చేరి రాష్ట్ర నాయకురాలుగా ఎదిగారు. పార్టీలో సరైన గుర్తింపు లేకపోవడంతో వైఎస్ఆర్ తెలంగాణ పార్టీలో చేరి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. 2018 ఎన్నికల్లో స్వతంత్ర్య ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తిరిగి బీఆర్ఎస్‌లో చేరి పార్టీలో కొనసాగుతుండగా రెండేండ్లుగా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. విజయశ్రీ ఆమె నివాస గృహంలో ఆమె పార్థీవదేహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆమె ఉద్యమంలో పాల్గొని ఉత్తేజ పరిచారని కొనియాయరు.



విజయశ్రీ(ఫైల్)

బీజేపీ సంకల్పయాత్రను విజయవంతం చేయాలి

భీమారం, ఫిబ్రవరి 23: బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు నర్ర గౌతంరెడి అన్నారు. శుక్రవారం మందమర్రిలో జరిగిన సంకల్పయాత్రకు భీమారం మండల నాయకులతో కలిసి బయలుదేరి వెళ్లారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి యాత్రలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీదే విజయమని చెప్పారు. కార్యకర్తలు కేంద్ర సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బాపు, కుమార్ యాదవ్, వనిత, వనిత పాల్గొన్నారు.

జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 23: సమ్మక్క సారలమ్మ జాతరకు సింగరేణి యాజమాన్యం పకడ్బందీ ఏర్పాట్లు చేసిందని ఏఐటీయూసీ గుర్తింపు సంఘం నాయకులు దాగం మల్లేష్, సుదర్శన్‌లు అన్నారు. శుక్రవారం వారు విలేకరులతోమాట్లాడుతూ నాలుగు రోజులుగా పట్టణంలోని అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న జాతరకు తమ యూనియన్ నాయకులు, కార్యకర్తలు వలంటీర్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. సమావేశంలో నాయకులు గాండ్ల సంపత్, మేకల సంతు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలను విజయవంతం చేయాలి

చెన్నూరు, ఫిబ్రవరి 23 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో సమన్వయంతో పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని చెన్నూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సిడాం దత్తు అన్నారు. ఆర్వో కార్యాలయంలో శుక్రవారం ఎఫ్ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, సెక్టోరల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో అధికారులు సమయ పాలన పాటించకపోవడంతో ఇబ్బందులు వచ్చాయని, పార్లమెంట్ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను సరిచేసుకుని ఎన్నికలను విజయవంతం చేయాలన్నారు. విధులు కేటాయించబడిన అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్, డీటీ లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం స్వగ్రామానికి రాక

- 24 రోజుల క్రితం గల్ఫ్‌లో మృతి

జన్నారం, ఫిబ్రవరి 23: మండలంలోని దేవునిగూడ గ్రామానికి చెందిన కునారపు వెంకటేష్ (24) ఇరాక్ దేశంలోని ఇబ్రహీల్ పట్టణంలో మృతిచెందగా ఆయన మృతదేహం శుక్రవారం స్వగ్రామానికి చేరుకుంది. వెంక టేష్ ఆరు నెలల క్రితం ఇరాక్ వెళ్లాడు. జనవరి 30వ తేదీన బ్రెస్ట్ స్ట్రోక్ రావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. 24 రోజుల తర్వాత ఆయన మృతదేహం స్వగ్రామా నికి చేరుకోవడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా రోధించారు. ఈ సందర్భంగా గల్ఫ్ సంక్షేమసమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య మాట్లాడుతూ 8 నెలల క్రితం వెంకటేష్‌కు వివాహం జరిగిందని చెప్పారు. ఉపాధి కోసం ఆరు నెలల క్రితం గల్ఫ్‌కు వెళ్లాడని తెలిపారు. అప్పుల ఒత్తిడి తట్టుకోలేక వేదనకు గురై బ్రెస్ట్ స్ట్రోక్‌తో మృతిచెంది ఉంటాడని తెలిపారు. ప్రభుత్వం గల్ఫ్ కార్మికులను ఆదుకోవాలని కోరారు. నాయకులు భీమరాజు, సత్యం ,తిరుపతి, రవి, లచ్చన్న, మల్లేష్, రాజు పాల్గొన్నారు.



వెంకటేష్(ఫైల్)

రైతులకు అవగాహన

హాజీపూర్, ఫిబ్రవరి 23: మండలంలోని దొనబండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జగిత్యాలలోని పొలాస ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు సామాజిక వనరులు గ్రామీణ భాగస్వామ్యం, ప్రిఫరెన్స్ ర్యాంకింగ్, సమస్యల చెట్టు, కాలక్రం తదితర అంశాలపై ముగ్గులతో కూడిన చిత్రాలు వేసి రైతులకు అవగాహన కల్పించారు. రైతులను వ్యవసాయసాగుపై అడిగి తెలుసుకున్నారు. మట్టినమూనాల సేకరణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హర్షిత్, శ్రీవత్స, రాంప్రసాద్, వివేక్ పాల్గొన్నారు.

ఆలయంలో కుంకుమార్చన పూజలు

జన్నారం, ఫిబ్రవరి 23: మండలంలోని కలమడుగు గ్రామంలో నర నారాయణ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం 108 మంది మహిళలు కుంకుమార్చన పూజలు నిర్వహించారు. శనివారం పౌర్ణమి సందర్భంగా గీతాహవనం, అన్నప్రసాద వితరణ ఆదివారం రథోత్సవం నిర్వహించనున్నారు.

మోదీ వల్లే ప్రపంచంలో అగ్రగామిగా భారత్

- శాంతియుతంగా అయోధ్య సమస్య పరిష్కారం
- 370 ఆర్టికల్ రద్దు చేయడంతో కాశ్మీర్‌లో అభివృద్ధి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



మంచిర్యాలలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఏసీసీ, ఫిబ్రవరి 23: ప్రధాని నరేంద్రమోదీ కృషి , పట్టుదల వల్లనే ప్రపంచంలోనే భారత్ అగ్రగామిగా నిలుస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మంచిర్యాల జిల్లాలో చేపట్టిన విజయ సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షో అనంతరం సభలో ఆయన మాట్లాడారు. 2014కు ముందు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అవినీతి, స్కాంలతో ప్రజలు విసిగిపోయారన్నారు. మోదీ ప్రధాని అయ్యాక కేంద్రంలో అవినీతి కనుమరుగైందన్నారు. అమెరికా అధ్యక్షుడి ముందు భారత ప్రధాని చేతులు కట్టుకుని నిలబడేవారని అన్నారు. ప్రస్తుతం ప్రధాని మోదీ ముందు అమెరికా అధ్యక్షుడు చేతులు కట్టుకుని నిలబడే రోజులు వచ్చాయన్నారు. పాకిస్థాన్ ప్రధాని, అధ్యక్షులకు కూడా మోదీ అన్నా, ఇండియా అన్నా భయం పట్టుకుందన్నారు. అపరిష్కృతంగా ఉన్న అయోధ్య రామ మందిర సమస్యను ప్రధాని మోదీ ఒక్క రక్తపు చుక్క నేల రాలకుండా ఒక నిరసన ప్రదర్శన చోటు చేసుకోకుండా పరిష్కరించారన్నారు. జమ్ము కాశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేయడం ద్వారా ఆ ప్రాంతం, ప్రజల అభివృద్ధి జరిగిం దన్నారు. ఉత్పత్తి రంగంలో మోదీ నేతృత్వంలో దేశం స్వయం సమృద్ధి సాధించిందన్నారు. 2014లో దేశంలో సెల్‌ఫోన్‌లు తయారు చేసే కంపెనీ లు 2 మాత్రమే ఉంటే ప్రస్తు తం 400 కంపెనీలు సెల్‌ఫోన్‌లు దేశంలో ఉత్పత్తి చేస్తున్నాయన్నారు. కరోనా వ్యాక్సిన్‌ను మనమే కనుగొన్నామని, అమెరికాకు కూడా సరఫరా చేసిన ఘనత భారత్‌దేనని తెలిపారు. చైనా , తదితర శత్రు దేశాలకు కూడా భారతదేశం అంటే వెన్నులో వణుకు పుట్టడానికి కార ణం ప్రధాని మోదీ కార్య దీక్షయేనని కొనియాడారు. దేశం అభివృద్ధి పథంలో సాగుతూ ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలవాలంటే మరోసారి మోదీని ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ,జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ , దేశంలో కాంగ్రెస్ పార్టీలు ఉండవని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బీజేపీ చేపట్టిన విజయ సంకల్పయాత్ర శుక్రవారం బెల్లంపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా కాంటా చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి మంత్రి కిషన్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పదేళ్లలో చేసిందేమి లేదని విమర్శించారు. గతంలో అధికారంలో ఉన్న సమయంలో కేసీఆర్ కుటుంబం అహంకారంగా వ్యవహరించిందని చెప్పారు. రాష్ట్రంలో గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఇసుక మాఫియా, భూకబ్జాలు, లిక్కర్ మాఫియాతో పాటు ప్రజాధనం సైతం దోచుకుని కుంభ కోణాలకు పాల్పడిందన్నారు. దీన్ని సహించని తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి భవిష్యత్‌లేకుండా చేశారని తెలిపారు. ఈ పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్‌లేకుండా పోతుందన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ ,సోనియాగాంధీ కుటుంబం 75 సంవత్సరాలు అధికారంలో ఉన్నా కూడా ప్రజలను దోచుకుందే తప్ప అభివృద్ధి చేయలేదని చెప్పారు. దేశంలో అధికారంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీ బొగ్గు కుంభకోణంతో పాటు 12 లక్షల కోట్ల వివిధ కుంభకోణాలకు పాల్పడిందన్నారు. అవినీతి లేని నాయకుడు ప్రధాని మోదీ అని, అవినీతి రహిత పార్టీ బీజేపీ అని అన్నారు. రామగుండంలో 6 వేల కోట్లతో ఎరువుల ఫ్యాక్టరీని ఏర్పాటు చేసింది బీజేపీ ప్రభుత్వమని తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో 17 ఎంపీ స్థానాలకు 17 మంది అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని కోరారు. అనంతరం మంత్రి కిషన్‌రెడ్డిని స్థానిక బీజేపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎర్రబెల్లి రఘునాథ్, రాష్ట్ర కార్యదర్శి గంగారెడ్డి, రాష్ట్ర నాయకులు కొయ్యల ఏమాజీ, తిరుపతి, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, నాయకులు రాచర్ల సంతోష్, శ్రీకృష్ణదేవరాయలు, రాజులాల్‌యాదవ్ పాల్గొన్నారు.

తాండూర్: బీజేపీ తలపెట్టిన విజయ సంకల్ప యాత్ర కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ముగించుకుని మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి సభకు వెళ్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. ఆయనకు పుష్ప గుచ్ఛాలు అందజేశారు.

మందమర్రిటౌన్: పార్లమెంట్ ఎన్నికలు ఎప్పుడు జరిగినా మూడవ సారి మళ్లీ మోదీ ప్రధాని కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు,కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం మందమర్రిలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. విజయ సంకల్పయాత్రకు మంచి స్పందన ఉందని ఆయన చెప్పారు. తెలంగాణలో మెజార్టీ పార్లమెంట్‌స్థానాలను బీజేపీ గెలుస్తుందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ మాట్లాడుతూ చెన్నూరులో గెలిచిన వెంటనే 40 వేల మందికి ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి నలుగురికి అయినా ఉద్యోగాలు ఇచ్చాడా అని విమర్శించారు. నిరుద్యోగుల కోసం ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిన కాకా కుటుంబం ఇతర రాష్ట్రాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. అంతకుముందు రాష్ట్రీయ రహదారి నుంచిమార్కెట్ వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన రొడ్డ మోహన్ బీజేపీలో చేరగా ఆయనకు కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ , బీజేపీ నాయకులు ఆరుముళ్ల పోశం, దుర్గం అశోక్, తదితరులు పాల్గొన్నారు.



బెల్లంపల్లిలో మంత్రి కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

మున్సిపల్ సర్వ సభ్య సమావేశంలో 40 అంశాలకు ఆమోదం

ఏసీసీ, ఫిబ్రవరి 23: పట్టణంలో చేపట్టే అభివృద్ధి పనులు 40 అంశాలకు శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్‌లో ఆమోదించారు. మంచిర్యాల మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం చైర్మన్ రావుల ఉప్పలయ్య అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశంలో 40 ఎజెండా అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. పట్టణంలోని కరెంటు స్తంభాలు , స్ట్రీట్ లైట్లు బిగించేందుకు టీఎస్ఎన్‌పీడీసీఎల్‌కు రూ. 13.8 లక్షలు చెల్లించడానికి ఆమోదం తెలిపారు. మున్సిపల్ సాధారణనిధులతో అత్యవసరంగా వివిధ పనులు చేపట్టడానికి రూ. 50.8 లక్షలు వెచ్చించేందుకు ఆమోదం తెలిపారు. గోదావరి తీరంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఐబీలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ స్థలంలో నిర్మించేందుకు గాను ప్రభుత్వానికి నివేదించేందుకు కౌన్సిల్ ఆమోదం పొందారు. సమావేశంలో వైస్ చైర్మన్ నల్ల మహేష్, కమిషనర్ మారుతి ప్రసాద్, కౌన్సిలర్లు , మేనేజర్ విజయ్‌కుమార్, ఇంజనీర్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 23 : హైద్రాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 2024-25 సంవత్సరానికి గాను 1వ తరగతిలో ప్రవేశం కోసం షెడ్యూల్డ్ కులముల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైద్రాబాద్ పబ్లిక్ స్కూల్‌నందు జిల్లాకు 2 సీట్లు కేటాయించారని తెలిపారు. జిల్లా వాసులై ఉండి జూన్ 1, 2017 నుంచి మే 31, 2018 మధ్య జన్మించి ఉండాలని పేర్కొన్నారు. మార్చి 12 మధ్యాహ్నం 3 గంటలలోగా దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. మార్చి 15న లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేయనున్నామని, వివరాల కోసం 9441874738లో సంప్రదించాలని సూచించారు.

ఆకట్టుకున్న మాక్ జడ్పీ సమావేశం

దండేపల్లి, ఫిబ్రవరి 23: వెల్గనూర్ ప్రభుత్వఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు నిర్వహిలచిన మాక్ జిల్లా పరిషత్ సమావేశం ఆకట్టుకుంది. జిల్లా పరిషత్ చైర్మన్, సీఈవో, జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీగా విద్యార్థులు వ్యవహరించారు. మేడారం జాతర, ఇతర జాతరల్లో ఉన్న సమస్యలు ప్రభుత్వం కల్పించిన చర్యల గూర్చి సమావేశంలో చర్చించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, స్నాన ఘట్టాలవద్ద పరిశుభ్రత. మంచి నీటి సౌకర్యం ఇతర అంశాలపై చర్చించారు. విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు కార్యక్రమం నిర్వహించామని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం రైతు వ్యతిరేక విధానాలు మానుకోవాలి

- అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 23: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను మానుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్ అన్నారు. హరి యాణాలో రైతులపై జరిగిన దాడికి నిరసనగా శుక్రవారం బ్లాక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో నల్ల జెండాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశ సంపదను ఆదానీ, అంబానీలకు దోచి పెడుతూ రైతులను మాత్రం పట్టించుకోకుండా దాడులు చేయిస్తున్నారని చెప్పా రు. రైతులపై కాల్పులకు ఆదేశాలు ఇచ్చిన హరియాణా ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేసి సీఎం, హోంశాఖ మంత్రిపై హత్యనేరం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాల్పుల్లో మృతిచెందిన యువ రైతు మృతికి కేంద్రం బాధ్యత వహించాలని, దేశ ప్రజలకు మోదీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, మంగ, మల్లన్న, శ్రీకాంత్, తిరుపతి,అరుణ, కాంతయ్య, బాపు, సురేందర్, దీప్తి, పాపారావు, మగ్బుల్ తదితరులు పాల్గొన్నారు.

● రైతులపై కాల్పులు అమానుషం

నెన్నెల: మద్దతు ధర కోరడమే నేరమన్నట్టు ఢిల్లీ సరిహద్దుల్లో హరియాణా ప్రభుత్వం రైతులపై కాల్పులు జరిపి ఓ యువ రైతును పొట్టన పెట్టుకోవడం అమానుషమని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు రత్నం తిరుపతి, జిల్లా కార్యదర్శి కొండ బానేష్ అన్నారు. రైతులపై కాల్పులు జరపడాన్ని ఖండించారు. ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో నెన్నెలలో శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, కృష్ణ, సాగర్, జోసెఫ్, గంగాధర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న నాయకులు

272 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ

సింగరేణి ప్రాంత నిరుద్యోగుల్లో ఉత్సాహం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 23 : సింగరేణిలో శుక్రవారం కొత్త ఉద్యోగాల కోసం యాజమాన్యం నోటిఫికేషన్ జారీ చేయడంతో ఈ ప్రాంత నిరుద్యోగుల్లో ఆనందం నెలకొంది. ఇప్పటికే పలు ఉద్యోగాల కోసం ప్రిపేరవుతున్న యువతీ, యువకులు ఈ ఉద్యోగాలను పొందేందుకు సిద్ధమవుతున్నారు. కాగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌తో రాష్ట్ర సచివాలయంలో సమావేశమై సింగరేణి సంస్థపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థలో ఖాళీగా ఉన్న 317 డైరెక్టు పోస్టులు, 168 ఇంటర్నల్ పోస్టులకు తక్షణమే భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదేశించారు. దీంతో తాము గురువారమే నోటిఫికేషన్ ఇస్తామని సీఎండీ ఆయనకు హామీ ఇచ్చారు. అన్నట్లుగానే ఆయన ప్రస్తుతం 272 ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్) ఈ-2 గ్రేడ్ పోస్టులు 139, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఫైనాన్స్ అండ్ అకౌంట్స్) ఈ-2 గ్రేడ్ పోస్టులు 22, మేనేజ్‌మెంట్ ట్రైనీ(పర్సనల్) ఈ-2 గ్రేడ్ పోస్టులు 22, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఐఈ) ఈ-2 గ్రేడ్ పోస్టులు 10, జూనియర్ ఎస్టేట్స్ అఫీసర్ ఈ-1 గ్రేడ్ పోస్టులు 10, మేనేజ్‌మెంట్ ట్రైనీ(హైడ్రో జియాలజిస్ట్) ఈ-2 గ్రేడ్ పోస్టులు 2, మేనేజ్‌మెంట్ ట్రైనీ(సివిల్) ఈ-2 గ్రేడ్ పోస్టులు 18, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ ఈ-1 గ్రేడ్ 3, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్(జీడీఎంఓ) ఈ-3 గ్రేడ్ 30 పోస్టులున్నాయి. అలాగే నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్‌లో సబ్ ఓవర్సీస్ ట్రైనీ(సివిల్) టి అండ్ ఎస్ గ్రేడ్-సీ పోస్టులు 16 ఉన్నాయి. అయా పోస్టులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు 1వ తేదీ మార్చి, మధ్యాహ్నం 12 గంటల నుంచి 18వ తేదీ మార్చి సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఉంది. అభ్యర్థుల వయస్సు 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వరకు ఉండాలి. అయితే జీడీఎంఓ పోస్టులకు మాత్రం 45 ఏళ్ల వరకు నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఐదేళ్ల వయస్సు మినహాయింపు ఇచ్చారు. సింగరేణిలో పనిచేస్తున్న ఉద్యో గులకు (ఇంటర్నల్ క్యాండిడేట్) వయస్సుతో నిమిత్తం లేకుండా అవకాశం కల్పించారు.

అవకతవకలు లేకుండా..

గతంలో జరిగిన అన్ని పోస్టులకు ఏవో ఒకరమైన అపవాదులు వచ్చాయి. అవకతవకలు జరిగాయని, ఉద్యోగాలను అమ్ముకున్నారని కూడా ప్రచారం జరిగింది. చివరకు విషయం కోర్టుల వరకు వెళ్లింది. కానీ ఈసారి జరిగే ఉద్యోగ నియామకాల్లో అటువంటి అపవాదు రాకుండా, అవకతవకలు జరుగకుండా చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సీఎండీని ఆదేశించారు. నియామకాలు నిక్కచ్చిగా జరిగేలా చూడాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

ఇసుక డంపులను సీజ్ చేయాలి

జైపూర్, ఫిబ్రవరి 23: మండలంలోని రామారావుపేట గ్రామంలో అనుమ తులు లేకుండా రైసుమిల్లు వద్ద ఉన్న ఇసుక డంపులను సీజ్ చేయాలని శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫయాజ్, రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. సుముఖి ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవెయిట్ శోభారాణి రామావు రావుపేట శివారులోని సర్వే నంబరు 210,218,219లో అక్రమ కట్టడాలు చేపడుతున్నారని, ఇందుకోసం అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని వివరించారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అలాగే అక్రమంగా భూములకు పట్టాలు చేయించుకుని జైపూర్ ఎస్టీపీపీ, ఇందారం ఓసీపీల నుంచి వచ్చే నష్టపరిహారం పొం దారని అన్నారు. దీనిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కో రారు. కార్యక్రమంలో నాయకులు సుంకరి శ్రీనివాస్, విశ్వంబర్‌రెడ్డి, గుడెల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలకంరణలో దేవతమూర్తులు

దండేపల్లి, ఫిబ్రవరి 23: దండెపల్లి మండలం గూడెం శ్రీసత్య నారాయణ స్వామి ఆలయంలో శ్రీస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖ్య అర్చకులు గోవర్ధన రఘు స్వామి, అర్చకులు సంపత్ స్వామి, వేదపండితులు అభిరామచార్యులు, దుద్దిళ్ల నారయణ శర్మ నవ గ్రహహోమం, స్థాళీపాక, పంచసూక్త హోమం నిర్వహించారు. భక్తు లు కుటుంబసమేతంగా సత్యదేవుడికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో నిరంతరం సప్తహ భజన కార్యక్రమం కొనసాగుతోంది.

జన్నారంకు చేరుకున్న మాదిగల జోడోయాత్ర


మాట్లాడుతున్న మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి

జన్నారం, ఫిబ్రవరి 23: మాదిగలకు రాష్ట్రంలో 12 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని చేపట్టిన మాదిగల జోడోయాత్ర శుక్రవారం జన్నారంకు చేరుకుంది. ఈ సందర్భంగా మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి మాట్లాడుతూ 12 శాతం రిజర్వేస్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ యాత్ర చేపడుతున్నామనాన్రు. ఈ యాత్ర ఆరు రోజుల పాటు జరుగు తుందన్నారు. మాదిగల్లో ఒకరికి మంత్రి పదవీ, ఒకరికి ఉపముఖ్యమంత్రి, రెండు లోక్ సభ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చిలుకల సంతోష్, గంగారెడ్డి, రాజేష్ ప్రభుదాస్, రమేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

దండేపల్లి, ఫిబ్రవరి 23 : మండల కేంద్రంలోని ప్రభు త్వ పాఠశాలలో తాళ్ళపేటకు చెందిన గుమ్మడి రాజలింగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ గుమ్మడి కిరణ్ 20 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. విద్యార్థులు కంటి చూపుతో ఇబ్బందులు పడకుండా పరీక్షలు చేశామని తెలిపారు. ర్యక్రమంలో ప్రధానోపాధ్యా యుడు శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధారి మైసమ్మ జాతర ప్రారంభం


సదర్ల భీమన్న విగ్రహాల వద్ద పూజలు చేస్తున్న నాయక్‌పోడ్‌లు

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 23: గిరిజన , నాయక్‌పోడ్‌ల ఆరాధ్య దైవంగా కొలిచే గాంధారి మైసమ్మ జాతర శుక్రవారం ఘనంగా మొదలైంది. మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ బొక్కలగుట్ట గాంధారి ఖిల్లాపై మూడు రోజుల పాటు జారత కొనసాగుతుంది. ఇందులో భాగంగా నాయక్‌పోడ్‌లు ఉదయం సదర్ల భీమన్న విగ్రహాలను ప్రత్యేక పూజలు నిర్వహించి మంచిర్యాలకు గోదావరి స్నానానికి డప్పు చప్పుల్ల మధ్య గిరిజన సాంప్రదాయ నృత్యాల మధ్య తీసుకెళ్లారు. మరుసటి రోజు జాతర జరిగే ఖిల్లాపై గోదావరి నది జలాలతో అమ్మవార్ల విగ్రహాలకు శుద్ధి చేసిన అనంతరం జాతర ప్రత్యేక నైవేద్యాలను సమర్పించి పూజలు నిర్వహిస్తారు. అదే విధంగా జాతరలో భాగంగా ప్రజా దర్బార్‌గా నిర్వహించే జీడికోట వద్ద గిరిజనులంతా సంస్కృతి సాంప్రదాయాలను గిరిజన నాయక్‌పోడ్‌ల విశిష్టతను వివరించుకునే విధంగా సభ ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి జాతర ప్రత్యేకతను చాటుతూ జాతరను ముగిస్తారు. గాంధారి ఖిల్లా నుంచి బొక్కల గుట్ట మీదుగా మంచిర్యాల గోదావరి నది జలాలను తీసుకెళ్లేందుకు బొక్కల గుట్ట ప్రాంతంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నాయక్‌పోడ్, గిరిజనులు పెద్ద ఎత్తున జాతరకు తరలి వచ్చి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుంటారు. మంచిర్యాల జిల్లా అధికారులు, రామగుండం కమిషనర్ ఆధ్వర్యంలో పోలీసుల జాతర ప్రాంగణం వద్ద భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

మందమర్రిరూరల్: మండలంలోని బొక్కలగుట్ట గ్రామపంచాయతీలోని గాంధారిఖిలా మైసమ్మ జాతరలో భాగంగా శుక్రవారం గోదావరి జలాల సేకరణ కోసం భీమన్న ఆలయం నుంచి కాలినడకన రొడ్డ వంశస్తులు మంచిర్యాల గోదావరికి వెళ్లారు. గోదావరి జలాలను సేకరించి తిరిగి భీమన్న ఆలయానికి చేరుకున్నారు. వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్ మాట్లాడుతూ గాంధారి ఖిలా మైసమ్మ జాతరలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్ది భార్గవ్, ఆలయ కమిటీ చైర్మన్ రొడ్డ రమేశ్ పాల్గొన్నారు.

లాస్య నందితకు నివాళి


నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 23 : రోడ్డు ప్రమాదంలో మరణించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందితకు మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, యువ నాయకుడు నడిపెల్లి విజిత్ రావు బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నివాళులు అర్పించారు. నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి బాధకరమని చెప్పారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతిచేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అక్కూరి సుబ్బయ్య, మేరుగు పవన్, కౌన్సిలర్ వంగ తిరుపతి, నాయకులు రాజ్‌కుమార్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 23 : ఈ నెల 25న హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సీతారాంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 22న నస్పూర్‌లోని సాధన పాఠశాల మైదానంలో ఎంపిక పోటీలు జరుగగా 400 మీటర్ల విభాగంలో ఎనిమిదవ తరగతికి చెందిన కె. రాము, సిహెచ్. రుచిత ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం పద్మజ, పీఈటీ మారయ్య తెలిపారు. ఎంపికైన విద్యార్థులను మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, ఉపాధ్యాయులు అభినందించారు. భవిష్యత్తులో మరింతగా రాణించాలని సూచించారు.

సైడ్ డ్రైనేజీ పనులు ప్రారంభం

జైపూర్, ఫిబ్రవరి 23 : ఇందారం గ్రామంలోని 11వ వార్డు ఎస్టీ కాలనీలో శుక్రవారం సైడ్ డ్రైనేజీ నిర్మాణపనులను శుక్రవారం ఎంపీటీసీ అరికె స్వర్ణసంతోష్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ ఎంపీ ల్యాడ్స్ రూ. 5 లక్షల నిధులతో సైడ్‌డ్రైనేజీ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. దీంతో వార్డులో డ్రైనేజీ సమస్య తీరిపోతుం దన్నారు. ఈ కార్యక్రమంలో మహేందర్, లక్ష్మణ్, గంగన్నదుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ ప్లాంటు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏసీసీ, ఫిబ్రవరి 23: మంచిర్యాల పట్టణంలోని శాలి వాహన పవర్ ప్లాంటు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి శుక్రవారం మంచిర్యాలలో ప్లాంటు కార్మికులు వినతి పత్రం అందించారు. మంత్రి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కమలాకర్, రాజుయాదవ్, ప్లాంటు కార్మిక సంఘం నాయకులు శంకర్, సత్యనారాయణ, ఆనందరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 23: శ్రీరాంపూర్‌లోని ప్రగతి స్టేడియంలో ఆదివారం ఉదయం 9 గంటలకు సీనియర్స్ మెన్ కబడ్డీ జట్టు ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఈ రాంచందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 85 కేజీల బరువు గల క్రీడాకారులు ఆధార్‌కార్డుతో పాటు 100 రూపాయలు ఎంట్రీ ఫీజు చెల్లించాలని సూచించారు. ఎంపికైన జట్టు వచ్చే నెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్స్ మెన్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

పీఎస్ఆర్ ఇంటికి వచ్చిన డిప్యూటి సీఎం


డిప్యూటి సీఎంకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే

ఏసీసీ, ఫిబ్రవరి 23: హైద్రాబాద్‌లోని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు శుక్రవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కుటుంబీకులతో కలిసి హాజరయ్యారు. డిప్యూటీ సీఎంకు ప్రేమ్‌సాగర్‌రావు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. మంచిర్యాల నియోజకవర్గంలోని పలు ప్రాజెక్టుల నిధుల మంజూరు, అభివృద్ధి తదితర విషయాలు చర్చించినట్లు సమాచారం .

విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

జన్నారం, ఫిబ్రవరి 23: కోటపల్లి మండలంలోని బోరంపల్లి గ్రామంలో పూలే దంపతుల విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని బీసీ కులాల ఉద్యమపోరాట సంఘం కరీంనగర్ జోన్ కన్వీనర్ నరసింహులు కోరారు. జన్నారంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దుండగలను పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. సమావేశంలో చంద్రయ్య, నరసయ్య, లక్ష్మీనారాయణ, రాజయ్య పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


చిన్న ధర్మారంలో నీటి సమస్యను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

కాసిపేట, ఫిబ్రవరి 23: తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కేకే గ్రూపు ఏజెంటు శ్యాంసుందర్ అన్నారు. మండలంలోని చిన్న ధర్మారం గ్రామంలో శుక్రవారం సీఎస్ఆర్ కమిటీ సభ్యులు పర్యటించారు. ఇటీవల గ్రామంలో తాగునీటి సమస్య ఉండడంతో గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని మందమర్రి జీఎంకు వినతి పత్రం అందజేశారు. దీంతో సీఎస్ఆర్ కమిటీ గ్రామంలోకి వచ్చి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేకే గ్రూపు ఏజెంటు శ్యాంసుందర్ మాట్లాడుతూ చిన్న ధర్మారంలో తాగునీటి సమస్య ఉందని, కాసిపేట పైపులైన్ నుంచి చిన్న ధర్మారంకు తాత్కాలికంగా మంచినీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుం టున్నామని తెలిపారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. అలాగే సీఎస్ఆర్‌నిదుల ద్వారా అంతర్గత రోడ్ల ఆధునీకరణ, డ్రైనేజీల నిర్మాణ పనులను చేపడతామన్నారు. కార్యక్రమంలో సివిల్ డీజీఎం జయప్రకాష్, తహసీల్దార్ భోజన్న, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్‌ప్రభాకర్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్‌కార్యదర్శి దాగం మల్లేష్ కాసిపేట గని మేనేజర్ అల్లావుద్దీన్, రాంప్రసాద్, బాపు, బన్న లక్ష్మణ్‌దాస్ పాల్గొన్నారు.

యువ కవులకు సన్మానం

వాంకిడి, ఫిబ్రవరి 23: అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా కేంద్రసాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ లయోల కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కవిసమ్మేళనంలో మండలంలోని నగర్‌గుట్ట మోకాసిగూడకు చెందిన యువకవులు ఆత్రం మోతీరాం, కోట్నాకసాయికుమార్‌ను సత్కరించారు. మాతృభాషలైన కొలామి, గోండి హాస్టల్‌లో వారు చేసిన కవితగానం ఎంతగానో ఆకట్టుకుంది.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

తిర్యాణి, ఫిబ్రవరి 23: మండలంలోని ఇర్కుపల్లి, ఎదులపాడు గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి మంజూరైన సీసీ రోడ్లకు బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ రుక్మిణిదేవ్, జడ్పీటీసీ చంద్రశేఖర్, ఎంపీటీసీ రాజ్యలక్ష్మి, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వైద్యశిబిరం

కెరమెరి, ఫిబ్రవరి 23: అనార్‌పల్లి బాలురఆశ్రమ పాఠశాలలో శుక్రవారం రాష్ట్రీయ బాలస్వస్తీయ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి రక్త నమునాలు సేకరించారు. కార్యక్రమంలో డాక్టర్‌సునంద, హెచ్‌ఎం వసంత్ రావు, వైద్యసిబ్బందికవిత, చంద్రకళ పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై విచారణ జరపాలి

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 23: జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి అంజుమ్ మృతిపై విచారణ జరపాలని ఏఐవైఎఫ్ నాయకుడు చిరంజీవి బీసీసంఘం నాయకుడు ప్రణయ్ డిమాండ్ చేశారు. పాఠశాల యజమాన్యం నిర్లక్ష్యం వల్లనే విద్యార్థిని మృతిచెందిందని, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కూడా ఉందన్నారు. వెంటనే విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఇబ్బందులకు గురిచేస్తున్న హెచ్‌ఎం

తిర్యాణి, ఫిర్యాదు 23: సెలవుల విషయంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఇబ్బందులకు గురిచేస్తున్నారని టీయూటీఎఫ్ జిల్లా నాయకుడు జనార్దన్, ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సెలవు అడిగితే హెచ్‌ఎం అంజయ్య ముప్పతిప్పలు పెడుతూ దురుసుగా వ్యవహరిస్తున్నాడని వారు పేర్కొన్నారు. కాగా ఈ విషయమై హెచ్‌ఎం అంజయ్యను వివరణ కోరగా దరఖాస్తు చేసుకున్నవారికి సెలవు మంజూరు చేస్తామని, తనపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

'ఉపాధి' పనులు ప్రారంభించాలి

జైనూర్, ఫిబ్రవరి 23: మండలంలోని పవర్‌గూడ గ్రామపంచాయతీలో ఉపాధిహామీ పనులను ప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఇప్పటివరకు వ్యవసాయపనుల్లో నిమగ్నంకావడంతో పనులు చేయలేకపోయామన్నారు. అదేవిధంగా గత సంవత్సరం చేసిన పనులకుగాను వేతనాలు కొంతమందికి నేటికీ ఇవ్వలేదన్నారు. ఉపాధిపనిప్రాంతంలో మొబైల్‌ఫోన్‌కు సిగ్నల్స్ రాకపోవడంతో హాజరుపడటం లేదనివారు ఆవేదనవ్యక్తం చేశారు.

వీడ్కోలు సమావేశం

దహెగాం, ఫిబ్రవరి 23: మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో పదవతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు శుక్రవారం కింది తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలుపాటలు అలరించాయి. ప్రత్యేకాధికారిణి రిజ్వానామాట్లాడుతూ విద్యార్థినులు కష్టపడిచదివి విద్యాలయానికి, తల్లిదండ్రులకు మంచిపేరుతీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో సీఆర్టీలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కోతకు గురవుతున్న వట్టివాగు డీ-6 కాలువ

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 23: మండలంలోని వట్టివాగు ప్రాజెక్టుకు సంబంధించిన డీ-6కాలువ రోజురోజుకు కోతకు గురవుతుండడంతో దానికింది భూములకు సాగునీరందడం లేదని రైతులు వాపోతున్నారు. డీ-6కాలువ ప్రాంతం వద్ద డ్రాప్‌లను నిర్మించాలని ఆయకట్టుదారులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందన లేదన్నారు. గతంలో అప్పటి సీఎంవో స్మితాసబర్వాల్ ఈ ప్రాంతాన్ని సంద ర్శించి అధికారులకు పలు సూచనలు చేశారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు తూములు నిర్మించాలని కోరుతున్నారు.


కోతకు గురైన వట్టివాగు డీ-6 కాలువ

'ఉపాధి' పనులు పరిశీలించిన ఎంపీడీవో


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో గంగాసింగ్

పెంచికలపేట, ఫిబ్రవరి 23: మండలంలోని చెడ్వాయి, బొంబాయిగూడ, ఎల్కపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఎంపీడీవో గంగాసింగ్ పరిశీలించారు. కూలీల పనిదినాలు, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కూలీలు ఎండవేడిమి గురి కాకుండా ఉదయం పూటే పనులకు వచ్చి సకాలంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. కొలతల ప్రకారం పనులు పూర్తి చేసి గిట్టుబాటు వేతనం పొందాలన్నారు. పని ప్రాంతంలో మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు.

దుండగులను శిక్షించాలని రాస్తారోకో

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 23: మంచిర్యాలజిల్లా కోటపల్లి మండలంలోని బోరపల్లి గ్రామంలో బుధవారం రాత్రి మహాత్మాజ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని జిల్లా కేంద్రంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్, మాలిసంఘం నాయకులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ విగ్రహాలను ధ్వంసంచేసిన దుండగులను వెంటనే శిక్షించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కేశవరావు, శంకర్, తరుపతి, మెంగాజీ, మారుతి, విశ్వనాథ్, తులసీరాం, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.


రాస్తారోకో చేస్తున్న మాలి, ఎమ్మార్పీఎస్ నాయకులు

రైస్ మిల్లును తనిఖీ చేసిన అధికారులు


రైస్‌మిల్లు షటర్‌కు నోటీసు అంటిస్తున్న అధికారులు

సిర్పూర్(టి), ఫిబ్రవరి 23: మండల కేంద్రంలోని వెంకట్రావుపేట బాలాజీ ఆగ్రోటెక్ రైస్‌మిల్లును శుక్రవారం తహసీల్దార్ బానయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజశేఖర్, శ్రీనివాస్, ఏఎస్‌వో వినోద్ తనిఖీ చేశారు. ఆ సమయంలో రైసుమిల్లు యజమాని అందుబాటులో లేకపోవడంతో పంచనామా నిర్వహించి రైసుమిల్లును సీజ్‌చేశారు. ఈ సందర్భంగా రైస్‌మిల్లు యజమానిని ఫోన్‌లో అధికారులు సంప్రదించగా అనారోగ్యకారణాల వల్ల ఆసుపత్రికి వెళ్లానని ప్రస్తుతం రాలేకపోతున్నానని సమాచారం అందించారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక


శివకృష్ణ

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 23: ఆసిఫాబాద్ పట్టణంలోని సెంట్‌మేరీ హైస్కూల్ విద్యార్థిని శివకృష్ణ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా డీఈవో అశోక్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సాంబశివరావు, జిల్లాగిరిజన క్రీడాధికారిణి మీనారెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాస్, పూర్ణచందర్, కరస్పాండెంట్ ఝాన్సీ, ప్రిన్సిపాల్ మేరికేవి, ఉపాధ్యాయులు థామస్, రాకేష్, కిరణ్, అర్చనకుమారి అభినందించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 23: మండలంలోని కర్జవెల్లి గ్రామానికి చెందిన మండిగ గోపాల్ దంపతులు ఇద్దరూ అంధులు, నిరుపేదలు కావడంతో మండల కేంద్రానికి చెందిన లోడెల్లి ప్రవీణ్ అతని తండ్రి జ్ఞాపకార్థం శుక్రవారం నిత్యావసర సరుకులను అందజేశారు. అదేవిధంగా మండలకేంద్రానికి చెందిన నిరుపేద కుటుంబం అయిన బైండ్ల రాందాస్, లక్ష్మికి స్వేరో జిల్లా అధ్యక్షుడు సురేష్ శుక్రవారం నిత్యావసర సరుకులు అందజేశారు.

ఆలయానికి విద్యుత్ ఉపకరణాల అందజేత

బెజ్జూరు, ఫిబ్రవరి 23: మహారాష్ట్రలోని అహిరికి చెందిన భాస్కర్ స్వాతి, మనోజ్ స్వప్న, యాదవ్‌జీ బండార్‌వార్ కుటుంబసభ్యులు స్వర్గీయ తులసీరాం భగీరథబాయి బండార్‌వార్ జ్ఞాపకార్థం శుక్రవారం మండల కేంద్రంలోని రంగనాయక ఆలయానికి విద్యుత్ ఉపకరణాలను అంద జేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు జగ్గాగౌడ్, మహేష్, సుధాకర్, తదితరులు ఉన్నారు.

నేటి నుంచి మహాదేవ జాతర

సిర్పూర్(యు), ఫిబ్రవరి 23: ప్రతిసంవత్సరం మాదిరిగా ఈఏడాది సైతం మండలంలో ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం మహాదేవ జాతర ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా మండలంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున యాత్రికులు జాతరకు తరలిరానున్నారు. ఆలయంలో శివలింగ పూజలు రాత్రి 8గంటలకు వేద పండితులతో జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. జాతర సందర్భంగా వచ్చేనెల 5న వాలీబాల్, 8న కబడ్డీ, 12న కుస్తీ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఏఐఎఫ్ఈఈ ఉపాధ్యక్షుడికి సన్మానం

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి23: అఖిలభారత విద్యుత్‌ఉద్యోగ సమాఖ్య (ఏఐఎఫ్ ఈఈ) ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఆసంఘం రాష్ట్రఅధ్యక్షుడు వి వెంకటేశ్వర్లును శుక్రవారం విద్యుత్‌ఉద్యోగులు సన్మానించారు. ఈసందర్భంగా ఆయనదృష్టికి పలు సమస్యలనుతీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్,కాగజ్‌నగర్ కార్మికులుపాల్గొన్నారు.


వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న ఉద్యోగులు

వైభవంగా సమ్మక్క సారలమ్మ జాతర


మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


అమ్మవారికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే హరీష్ బాబు


బంగారంతో వస్తున్న భక్తులు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 23: కాగజ్‌నగర్ పెద్ద వాగు సమీపంలో ఏర్పాటు చేసిన గద్దెలవద్ద కొలువుదీరిన సమ్మక్క,సారలమ్మలను భక్తులు దర్శించుకున్నారు. గురువారం రాత్రి పూజారులు డప్పు, వాయిద్యాల మధ్య సమ్మక్కను గద్దెపైకి తెచ్చారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించిన అనంతరం భక్తులను మొక్కులు తీర్చుకునేందుకు అనుమతించారు. భక్తులు బంగారాన్ని తల్లులకు సమర్పించి ఒడి బియ్యం పోశారు. చిన్నారులకు తలనీలాలు తీయించారు. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తల్లులను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.



కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 23: జిల్లా కేంద్రంలో బీడీపీపీ, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని నాయకులు సారంగపాణి, రవి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని రాజంపేట శివారు, గుండి రోడ్డు, రవిచంద్రకాలనీ, అంకుశాపూర్ శివార్లలో ప్రభుత్వ భూములను కబ్జాచేసి వెంచర్లు వేసి విక్రయిస్తున్నారన్నారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టుకు 19ఏళ్లు

● నేటికీ అసంపూర్తి ● కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు



అసంపూర్తి దశలోనే ఉన్న జగన్నాథ్‌పూర్‌ప్రాజెక్టు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 23: సిర్పూరు నియోజకవర్గంలో ఉన్న జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు నిర్మాణం పనులు మొదలుపెట్టి ఇప్పటికీ 19 ఏళ్లు అయింది. 2005లో అప్పటిసీఎం వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి హయాంలో జగన్నాథ్‌పూర్ వద్ద పెద్దవాగు సమీపంలో జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. రూ.125కోట్ల నిధులు మంజూరు చేశారు. ప్రాజెక్టు కింద 15వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేలక్ష్యంతో నిర్మాణం చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. తొలుత ఈ పనులు చేపట్టేందుకు గ్యామన్ ఇండియా కాంట్రాక్టర్‌పనులు దక్కించు కున్నారు. ఆది నుంచి ఈ ప్రాజెక్టు పనులకు ఆటంకం ఏర్పడింది. పెద్దవాగు నీటి ప్రవాహం పెరగటంతో పనులను ఆపేశారు. అలాగే పనుల విష యం, నిధుల కేటాయింపులు చేయకపోవటం ఫలితంగా కేవలం ఎక్కడి పనులు అక్కడే నిలిచిపో యాయి. రాష్ట్రాలు విడిపోవటంతో ఈ ప్రాజెక్టు సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి అప్పటి ఎమ్మెల్యే కోనప్ప తీసుకెళ్లారు. తొలుత టెండరువేసిన ధరలు, ప్రస్తుతం ఉన్న ధరలు అధికం కావటంతో మళ్లీ ఈ ప్రాజెక్టు వ్యయాన్ని రూ.246.48 కోట్లకు ప్రభుత్వం పెంచింది. ఈ నిధులతో పిల్లర్ స్థాయి నుంచి గేట్ల వరకు వచ్చింది. ఇంకా కాల్వలు నిర్మించాల్సి ఉంది. కాగజ్‌నగర్, జగన్నాథ్‌పూర్‌లోని పలు మండలాల మీదుగా కాల్వలు పోతుండటంతో నష్టపరిహారం విషయంలో న్యాయం జరుగటం లేదని రైతులు పనులను జరుగనీయలేదన్నారు. దీంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశాడు. ఏటా విస్తారంగా వర్షాలు కురుస్తున్నప్పటికి కూడా నిల్వ చేసుకోలేని దైన్యస్థితి దాపురించింది. ఈ ప్రాంతానికి ఎంతగానో ఉపయోగపడే ప్రధాన ప్రాజెక్టుపై అధికారులు నిర్లక్ష్యం చూపించటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఈ ప్రాజెక్టుపనులు పూర్తి అవుతుందని తమ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని అంతా ఆశిస్తున్నా.. అది కలగానే మారుతోంది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తారని ఈ ప్రాంత రైతులు ఎదురుచూస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదకలు పంపించాం..
- తిరుపతి, ఇరిగేషన్ డీఈ, కాగజ్‌నగర్

జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టుకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదికలను పంపించాం. భూ సేకరణ సమస్య పెండింగ్‌లో ఉంది. రెవెన్యూ అధికారులకు కూడా కాల్వల నిర్మాణానికి ఎంత భూమి కావాలన్న వివరాలు తెలియజేశాం. తదుపరి ఆదేశాలు రాగానే పనులు చేపడతాం.

మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 23: జిల్లాలోని స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి రుణాల మంజూరు ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాగ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, ఏపీడీ చరణ్ దాస్, లీడ్‌డిస్ట్రిక్ట్ మేనేజర్ హనుమంత్‌తో కలిసి స్వయం సహాయ సంఘాల ఆర్థిక స్థితిగతులు, పురోగతిపై జిల్లాలోని ఏపీఎంలు, సీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి రుణాల మంజూరుద్వారా కృషిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సంఘం ఖాతాతో బ్యాంకు లింకేజి ప్రక్రియ వందశాతం పూర్తి చేయాలన్నారు. ఆయా సంఘాలు గతంలో పొందిన రుణాలను తిరిగి చెల్లించే విధంగా చర్యలు తీసుకోవడంతోపాటు అర్హత కలిగిన సంఘాలను గుర్తించి రుణమంజూరు ద్వారా వారిని ప్రోత్సహించాలన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు బ్యాంకు అధికారులు, ఏపీఎంలు, సీసీలు సమన్వయంతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి రుణాల రికవరీ, బ్యాంకు లింకేజీలతో వెనుకబడి ఉన్న మండలాలపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు.

కార్యక్రమంలో డీపీఎంలు రామకృష్ణ, అన్నాజీ, యశోద, యాదగిరి, జిల్లాలోని అన్ని మండలాల ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

జాతరకు ఏర్పాట్లు పూర్తి

దహెగాం, ఫిబ్రవరి 23: మండలంలోని బ్రీబా గ్రామంలోని లక్ష్మీవెంకటేశ్వరసహిత సద్గురు సాయినాథ దేవాలయంలో శనివారం నిర్వహించే జాతరకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయకమిటీ నిర్వాహకులు తెలిపారు.

లైసెన్సులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్

వాంకిడి/దహెగాం, ఫిబ్రవరి 23: మండలాల్లోని ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు తమ దుకాణ లైసెన్సులను ఆన్‌లైన్ పోర్టల్‌లో ఓఎల్‌ఎంఎస్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఫర్టిలైజర్ దుకాణాల యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా లైసెన్సులు ఆన్‌లైన్‌లో నమోదుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్ దుకాణాల్లో నకలీ విత్తనాలు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు సరైన మందులు, విత్తనాలు అందించాలని రైతులు తీసుకున్న క్రిమిసంహారక మందులకు, విత్తనాలకు రశీదులు అందించాలన్నారు. దహెగాంమండలంలో ఏవో వంశీకృష్ణ డీలర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో మిలింద్‌కుమార్, ఏఈవోలు రాజేశ్వర్, మానస, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి గెలిస్తే 4అంశాలపై దృష్టిపెడతాం

● కేంద్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి



రోడ్‌షోలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి

కాగజ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 23: మూడోసారి గెలిస్తే ప్రత్యేకంగా 4అంశాలపై దృష్టి పెడతామని కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్‌లో నిర్వహించిన విజయ సంకల్పసభలో ఆయన మాట్లాడారు. మహిళలు, రైతులు, యువత, మారుమూల ప్రాంతాల్లోని గిరిజన, దళిత, పేదప్రజలను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని అన్ని వర్గాల నుంచి బీజేపీకి మద్దతు వస్తోందన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ మొదటి వారంలో జరిగే అవకాశాలున్నాయన్నారు. మూడోసారి మోదీ ప్రధాని కావాలని దేశంలోని ప్రతీ ఒక్కరూ కోరుకుంటున్నారన్నారు. ఇప్పటికే అన్నివర్గాల అభివృద్ధికి కృషి చేశామన్నారు. కేవలం 3రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఓటమి చెందడం తథ్యమన్నారు. పొరుగు రాష్ట్రం కర్ణాటకలో అమలు కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు. కర్ణాటకలో అక్కడి ఎమ్మెల్యేలే ప్రజలకు ఇచ్చిన గ్యారంటీల హామీలు అమలు కాకపోవడంపై క్షమాపణలు కోరుతున్నారన్నారు. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోనూ ఉన్న 4లోక్‌సభ సీట్లు రావన్నారు. తెలంగాణాలోనూ ఇదేపరిస్థితి ఉంటుందన్నారు. 17 లోక్‌సభ స్థానాల్లో హైదరాబాద్‌లో ఎంఐఎం పార్టీతో సహా17 స్థానాలు గెలుచుకుంటామన్నారు. దేశంలో మూడోసారి ప్రధాని మోదీ హవా మరోసారి కొనసాగి 400పైగా స్థానాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో మహిళల సంక్షేమం కోసం రిజర్వేషన్ బిల్లు తీసుకువచ్చినట్లు, అలాగే మైనారిటీ మహిళలకు త్రిపుల్ తలాక్ రద్దుతోపాటు రైతులకు అనేక రకాలైన ఎరువులు, విద్యుత్, పీఎంకేఎస్ నిధి, మద్దతు ధర, యూరియా కొరత లేకుండా అందిస్తున్నామన్నారు. పసుపు బోర్డు, పంటలకు మద్దతు ధర అందించిన ఘనత కేంద్రానిదేనన్నారు. కార్యక్రమంలో ఎంపీ సోయం బాపూరావు, సిర్పూర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యేలు పాల్వాయి హరీష్‌బాబు, పాయల శంకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, మాజీ ఎంపీ రమేష్ రాథోడ్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం

రెబ్బెన, ఫిబ్రవరి 23: గంగాపూర్ శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణం అట్టహాసంగా జరిగింది. గంగాపూర్ జాతర సందర్భంగా తొలిరోజు స్వామివారి కల్యాణం నిర్వహించారు. టీటీడీ ప్రతినిధి గొల్లపల్లి సత్యనారాయణ టీటీడీ నుంచి పట్టువస్త్రాలు, తలంబాలు, కంకణాలు, పుస్తెలు తీసుకరాగా, బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ ఆలయం వరకు నెత్తిపై పెట్టుకొని వచ్చి సమర్పించారు. వేదపండితులు శ్రీనివాసచార్యులు, వేణుగోపాలాచార్యులు, మురళీధరచార్యులు, రామకృష్ణచార్యులతోపాటు ప్రధాన అర్చకుడు గణేష్ పంతులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. సీఐ చిట్టిబాబు, శ్రీనివాస్, సతీష్, ఎస్సైలు చంద్రశేఖర్, రమేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు. డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు స్వామివారిని దర్శించుకున్నారు. పలు వ్యాపార సంస్థల ప్రతినిధులు అన్నదానం ఏర్పాటు చేశారు.



వెంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

బాలభారతి పూర్వ ప్రధానోపాధ్యాయురాలి మృతి

● సంతాపం ప్రకటించిన ఉపాధ్యాయులు

కాగజ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 23: బాలభారతి ఎయిడెడ్ ఉన్నత పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయురాలు పంకజవల్లి శుక్రవారం మృతిచెందారు. ఆమె మృతిపట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వవిద్యార్థులు పాఠశాలలో సంతాపం తెలిపారు. బాలభారతి పాఠశాలలో ఆమె చేసిన సేవలు ఎనలేనివని గుర్తు చేసుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలిగా 35సంవత్సరాల పాటు పనిచేసి, ఎంతో మంది విద్యార్థులు ఉన్నతశిఖరాలు అధిరోహించేందుకు ఆమె కృషి చేసిందని పేర్కొన్నారు. ఆమె మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వసీముద్దీన్, వైస్‌చైర్మన్ నాగశ్వర్ రావు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




తల్లుల ప్రసాదం కోసం ఎగబడుతున్న భక్తులు



తల్లుల దర్శనం కోసం క్యూ లైన్లలో బారులుదీరిన భక్తులు



తిరుగు ప్రయాణం కోసం ఆర్టీసీ క్యూ లైన్లలో జనం



తిరుగుపయనమైన భక్తులతో ఆర్టీసీ బస్టాండ్ క్యూలైన్లు, భక్తులను తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు



మొక్కులు సమర్పించేందుకు వచ్చిన భక్తులతో కిక్కిరిసి పోయిన గద్దెల ప్రాంగణం

భక్త జన హోరు..

▸▸ వనదేవతల రాకతో పోటెత్తిన భక్తులు ▸▸ నిరంతరాయంగా దర్శనాలు ▸▸ మొక్కులు చెల్లించుకున్న సీఎం, గవర్నర్



మేడారం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో మూడోరోజు శుక్రవారం కూడా భక్తులు జోరుగా మొక్కులు సమర్పించుకున్నారు. తల్లుల దర్శనాలు నిరంతరాయంగా కొనసాగుతుండగా తరలివస్తున్న భక్తులతో గద్దెల ప్రాంగణం పోటెత్తుతోంది. క్యూలైన్లన్నీ కిటకిటలాడుతున్నాయి. వీఐపీ ప్రవేశ ద్వారాల వద్ద కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వేచిచూస్తుండడంతో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి. గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకున్న తర్వాత భక్తులు మొక్కులు చెల్లించుకోవడం మరింత జోరందుకుంది.

ప్రముఖుల తాకిడి

జాతరలో శుక్రవారం వీఐపీల తాకిడి పెరిగింది. ప్రముఖులంతా ఈ రోజే రావడంతో అధికారులపై ఒత్తిడి కనిపించింది. గవర్నర్ తమిళిసై సౌందరాజన్, కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా, సీఎం రేవంత్ రెడ్డి సమ్మక్కను దర్శించుకొని మొక్కులను సమర్పించుకున్నారు. ఉదయం గవర్నర్‌తోపాటు కేంద్రమంత్రి ప్రత్యేక హెలికాప్టర్‌లో గద్దెల వద్దకు చేరుకున్నారు. ఎత్తుబంగారాన్ని తల్లులకు సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు చీరెలను సమర్పించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌లో మేడారం చేరుకున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, దనసరి అనసూయ, శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎస్ఎస్‌వీ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు ప్రభుత్వ సీఎస్ శాంతికుమారి తదితరులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు. అంతకుముందు మంత్రి సీతక్క సీఎంకు స్వాగతం పలకగా అధికారులు ఆలయ మర్యాదలతో గద్దెల వద్దకు తోడ్కొని వెళ్లారు. అలాగే రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు తల్లులను దర్శించుకున్న వారిలో ఉన్నారు.



నేడు వన ప్రవేశం.. ముగియనున్న జాతర

గద్దెలపై కొలువుదీరి భక్తులకు ఆశీస్సులందిస్తున్న వనదేవతలు శనివారం వనప్రవేశం చేయనున్నారు. దీంతో నాలుగు రోజుల పాటు వైభవంగా జరిగిన సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు తెరపడనుంది. శనివారం సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్యతో పాటు మిగతా పూజారులు సమ్మక్క గద్దె వద్దకు చేరుకొని చివరి పూజలు చేసి.. తల్లి రూపాన్ని తీసుకొని చిలకలగుట్టపైకి తీసుకువెళ్లి నిజస్థానంలో ఉంచి వెనుదిరుగుతారు.